
# ఉనికిని కాపాడుకోలేని మజ్లిసేతర పార్టీలు

- పాతబస్తీలోని 4 నియోజకవర్గాల్లో బేఖాతరు చేసిన ఓటర్లు
- డిపాజిట్లు కాపాడుకోలేని వివిధ పార్టీల అభ్యర్థులు
- పార్టీ ఫండ్, ఓట్ల చీలిక కోసమేనా.. అన్నట్లు ఫలితాలు



**చార్మినార్:** మజ్లిసేతర పార్టీలను పాతబస్తీ ఓటర్లు బేఖాతరు చేశారు. పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాలలో ఆయా అభ్యర్థులు ఏమాత్రం ఓటర్లను ప్రభావితం చేయలేక పోయారు. ఈ ఎన్నికల్లో పాతబస్తీలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన మజ్లిసేతర పార్టీల అభ్యర్థులు కనీసం డిపాజిట్లను సైతం దక్కించుకోలేక పోయారు. చార్మినార్‌లో బీజేపీ, యాకుత్‌పురాలో ఎంబీటీ పార్టీల అభ్యర్థులు మజ్లిస్ పార్టీ అభ్యర్థితో హోరాహోరీ పోరు కొనసాగించి రెండో స్థానంలో నిలిచారు. పాతబస్తీలో సరైన నాయకగణం లేకపోవడమే కాకుండా.. టికెట్లు కేటాయింపులో పార్టీ అధిష్టానం వ్యవహరించిన తీరు స్థానిక నాయకులకు మింగుడుపడలేదు. మొదటి నుంచి పార్టీ టికెట్లు ఆశించిన సీనియర్ నాయకులకు కాకుండా వేరే వారికి కేటాయించడంతో పాతబస్తీలో మజ్లిసేతర పార్టీలు చతికిలబడ్డాయి. ముందుగా ఆశించిన విధంగా సకాలంలో పార్టీ ఫండ్ లభించకపోవడంతో పాతబస్తీ మజ్లిసేతర పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలా..అంటూ అభ్యర్థులు వాపోయారు. పార్టీ ఫండ్‌పై ఉంచిన శ్రద్ధ ప్రచారంపై చూపించ లేదు.

### పార్టీ ఫండ్ ఓట్లు చీల్చడం కోసమేనా పోటీ..?

- పాతబస్తీ నుంచి టికెట్లు ఆశించిన మజ్లిసేతర పార్టీల అభ్యర్థులు కేవలం పార్టీ ఇచ్చే ఫండ్‌తో పాటు ఒక వర్గం ఓట్లు చీల్చడం కోసమేనా అన్నట్లు ఎన్నికల సరళి కనిపించింది.
- మజ్లిస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు ఫ్రెండ్లీ పార్టీలంటూ ఎన్నికల బరిలో తమ అభ్యర్థులను నిలిపారు.
- మజ్లిస్ పార్టీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపగా.. లోపాయికారి ఒప్పందంతో బీఆర్ఎస్ అంతగా ప్రభావం చూపని బలహీనమైన అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపింది. ఈ విషయం ఫలితాల సందర్భంగా స్పష్టమైంది.
- పార్టీ ఫండ్ వస్తేనే ప్రచారం నిర్వహిస్తామనే ధోరణిలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉంటారు. ఒక దశలో పార్టీ ఫండ్ రావడం లేదని తెలుసుకుని పార్టీ అధినేతల వద్దకు 'క్యూ'కడుతుంటారు.
- ప్రతి ఎన్నికల సందర్భంగా పాతబస్తీలో చోటు చేసుకునే అంశం ఇదీ.

#### చార్మినార్ నియోజక వర్గంలో..

బీజేపీ అభ్యర్థి మెఘారాణి 26,249 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా..కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ 10898 ఓట్లతో మూడో స్థానం దక్కించుకోగా.. బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గంలో తన ఉనికిని కోల్పోయే విధంగా ఇక్కడి చార్మినార్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధి 8853 ఓట్లతో నాలుగో స్థానానికి దిగజారిపోయి డిపాజిట్ కోల్పోయాడు.

#### చాంద్రాయణగుట్టలో..

బీఆర్ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి 14,224 ఓట్లతో రెండో స్థానంలో.. బీజేపీ అభ్యర్థి 16114 ఓట్లతో మూడో స్థానం దక్కించుకున్నప్పటికీ డిపాజిట్ దక్కలేదు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలు ఓట్ల చీలికకు మాత్రమే పోటీలో ఉన్నట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

#### బహదూర్‌పురాలో..

బీఆర్ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ 22246 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచినప్పటికీ డిపాజిట్ కాపాడుకోలేకపోయాడు. మజ్లిస్ పార్టీకి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ 14278 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. వీరెవరూ డిపాజిట్లను కాపాడుకోలేకపోయారు.

#### యాకుత్‌పురాలో..

ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ 45200 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి వీరేందర్ యాదవ్ 22165 ఓట్లుతో మూడో స్థానంలో నిలువగా..బీఆర్ఎస్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ నియోజకవర్గంలో ఎంబీటీ అభ్యర్థి మజ్లిస్ పార్టీకి గట్టి పోటీ నిచ్చి ఫలితాల సందర్భంగా నువ్వా..నేనా..అన్న రీతిలో ఉత్కంఠకు తెలిపారు.

### స్థానికులే అయినా.. ఉనికిని కాపాడుకోలేకపోయారు..

- పాతబస్తీలోనే పుట్టి పెరిగిన అభ్యర్థులను మాత్రమే వివిధ పార్టీలు (మజ్లిసేతర) రంగంలోకి దింపినప్పటికీ ఏ మాత్రం ఫలితం లేకుండాపోయింది.
- స్థానికంగా ఉన్న నాయకులే అయినప్పటికీ.. ఆశించిన విధంగా ఓట్లు సంపాదించలేకపోయారు.
- చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాల అభ్యర్థులకు పాతబస్తీ ఓటర్లు ఏమాత్రం మొగ్గు చూపలేదు. ఏదీ ఏమైనప్పటికీ మజ్లిసేతర పార్టీల అభ్యర్థుల్లో కొందరు కనీసం డిపాజిట్లను సైతం దక్కించుకోలేక పోయారు.

## ప్రజా సేవకే జీవితం అంకితం



కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**గోల్కొండ:** ప్రజా సేవకే జీవితం అంకితం చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యేగా మూడవసారి ఎన్నికైన కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకీ మిరాజ్ కాలనీలో పలువురు మజ్లిస్ కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను పరిష్కరించానన్నారు. అందువల్లే ప్రజలు తనను మరోసారి గెలిపించారని పేర్కొన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్ ఉన్నారు.

## 'కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం'



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హమీదుద్దీన్ సహసీన్

**గోల్కొండ:** కాంగ్రెస్ పాలనలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నగర మైనార్టీ విభాగం నాయకుడు హమీదుద్దీన్ సహసీన్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు లభించిన సందర్భంగా సోమవారం గోల్కొండ బంజరా దర్వాజ వద్ద విజయం సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మెచ్చే విధంగా పాలించగలిగేది ఒక్క కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పూర్తిగా చితికిపోయిందని ఆయన అన్నారు. అయితే బీజేపీ, మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలన్ని సొంత లాభం కోసమే పని చేసే పార్టీలని ఆయన అన్నారు. ఎం.ఏ.జాకీర్, మన్సూర్‌ఖాన్, జావేద్ అలీ, షారుఖ్ తదితరులున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన కావూరి వెంకటేష్



మైనంపల్లి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిని కావూరి వెంకటేష్

**లంగర్‌హౌస్:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కావూరి వెంకటేష్ సోమవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కావూరి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ ప్రారంభం నుంచి తాను సేవలు అందిస్తున్నా తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల గడుస్తున్నా గుర్తింపు ఇవ్వకపోవడంతో మైనంపల్లి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరి ప్రజలకు సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేస్తారనడంతో తిరుమల కాలినడకన వెళ్లి, ఢిల్లీలో రోడ్డుపై గుమ్మడికాయతో దిష్టి తీసి అందరిని కావూరి ఆకట్టుకున్నారు.

## సాంబశివరావుకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, చిత్రంలో ముట్నూరి కామేశ్వరరావు

**నాంపల్లి:** రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ హైదరాబాద్ సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రతి ఏటా ప్రదానం చేసే చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ఈ ఏడాది అందజేయడం సముచితంగా ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. ఈనెల 5న సాయంత్రం 6 గంటలకు తెలుగు వర్సిటీలో ప్రదానం చేసే పురస్కారం-2023 పోస్టర్‌ను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి ప్రసంగించారు. 1999 నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా ప్రతిభా పురస్కారాలను లబ్ధ ప్రతిష్టులైన ప్రముఖులకు అందజేస్తుండడం సంతోషదాయకం అన్నారు. చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు కన్వీనర్ ముట్నూరి కామేశ్వరరావు మాట్లాడుతూ..చాట్ల శ్రీరాములు 92వ జయంతి వేడుకలను పురస్కరించుకుని సాంబశివరావుకు ప్రతిభా పురస్కారాన్ని తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు చేతుల మీదుగా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, సేనాపతి, అరుణ్‌కుమార్, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

## 'నూతన ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకెళ్తాం'



ఎస్ఎం ముజీబ్ హుస్సేని

**అబిడ్స్:** పలు శాఖల ఉద్యోగుల సమస్యలు నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సమస్యలు చాలా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాము ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రెటరీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. టీఎన్జీఓస్ నూతన ప్రభుత్వానికి అండగా ఉండి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుందని ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు.

## 'దొరల పాలన అంతమైంది'



మనిలాల్ షాను సత్కరించిన కైలాష్ అగర్వాల్

**అబిడ్స్:** తెలంగాణలో కేసీఆర్ దొరల పాలన అంతమైందని గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మనిలాల్ షా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పలువురు నాయకులు కై లాష్ అగర్వాల్, ప్రశాంత్ కిషర్, భజరంగ్ అగర్వాల్, పండిత్, జైబాబలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనిలాల్ షా మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంతో మేలు జరుగుతుందన్నారు.

## ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి కాంగ్రెస్



మొగిలి సునీతారావు

**అబిడ్స్:** ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొగిలి సునీతారావు పేర్కొన్నారు. 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు ప్రజలకు అందిస్తామన్నారు. గోషామహల్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌లు భారీ రిగ్గింగ్‌కు పాల్పడ్డాయని ఆమె ఆరోపించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ..బీజేపీ, బీఆర్ఎస్‌లు ఓటర్లను భయపెట్టారన్నారు. పోలింగ్ బూత్‌లలో తమ పార్టీ ఏజెంట్లను బీజేపీ భయపెట్టించి విజయం సాధించిందన్నారు. నైతిక విజయం తనదే అని సునీతారావు పేర్కొన్నారు. తనకు ఓట్లువేసిన అన్నివర్గాల ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛమైన పరిపాలన ప్రజలకు అందిస్తుందని ఆమె అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు గోషామహల్‌లో పెద్ద ఎత్తున అరాచకాలకు పాల్పడ్డాయన్నారు.

# కాంగ్రెస్ నేతల సంబురాలు



డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావును కలిసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**సుల్తాన్‌బజార్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సాధించిన అద్భుత విజయాన్ని పురస్కరించుకుని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సెంట్రల్ యూనియన్ ఆఫీస్ నందు స్వీట్లు పంచి విజయోత్సవాలను నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్‌ను సత్కరించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావును కలిసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. వేణుగోపాల్ గౌడ్, గోవింద్‌రెడ్డి శ్రీనివాస్, భాస్కర్, అనిల్, నర్సిరెడ్డి, నిరంజన్, తిరుపతి, జోసెఫ్ సంతోష్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో..



ఆర్టీసీ కార్మికులకు మిఠాయిలు తినిపిస్తున్న వెంకటేష్

**చాంద్రాయణగుట్ట:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో కార్మికులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ చార్మినార్ ఇన్‌చార్జి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులతో కలిసి బాణాసంచా కాల్చి...మిఠాయిలు తినిపించుకున్నారు. ఆర్టీసీ కార్మికులు కె.రవీందర్, గులాం గౌస్, మహ్మద్ అష్ఫాక్, సుధాకర్‌రావు, వీరేశం, ఎస్.డి. మహమూద్, జె.సురేష్, సాయి, కృష్ణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



సత్తి ప్రకాష్‌రెడ్డి

**అబిడ్స్:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీ ఐ డిపార్ట్‌మెంట్స్ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది సత్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..రాష్ట్రంలో బీఆర్ఎస్ అరాచకాలను కట్టడి చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా కష్టించిన రేవంత్‌రెడ్డికి పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రిగా నియమించి బంగారు తెలంగాణ సాధనకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంలో ఉన్నట్లు అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రగతి అందుతుందని ఆయన పేర్కొన్నారు.

## బీజేపీతోనే ప్రజాభివృద్ధి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సత్కరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**అబిడ్స్:** బీజేపీతోనే ప్రజాభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ హ్యాట్రిక్ పొందడంతో ధూల్‌పేట్‌లోని ఆయన నివాసానికి సోమవారం కిషన్‌రెడ్డి విచ్చేసి అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని రాజాసింగ్ సత్కారం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరస్కరించారన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ..3వ సారి తనను గెలిపించిన ప్రజల రుణాన్ని మరిచిపోలేనన్నారు. అహర్నిశలు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు.

## రేపు అయ్యప్ప పడిపూజ

**జియాగూడ:** ఈ నెల 6న జియాగూడలోని సంజయ్‌నగర్‌లో గల నల్లపోచమ్మ తుల్జాభవానీ ఆలయంలో ధర్మశాస్త్ర అయ్యప్ప పడిపూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు రావుల సుదర్శన్‌రావు, శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు రామ్మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో దీపారాధన, గణపతి పూజ, అయ్యప్పస్వామి అభిషేకం, అలంకరణ హరి హరపుత్ర భజనమండలి ద్వారా మహేష్ గురుస్వామి భజన కార్యక్రమం మధ్యాహ్నం 18 మెట్ల అఖండ హారతి, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## రేపు హరికథా మహోత్సవాలు ప్రారంభం

**నాంపల్లి:** పూర్ణయజ్ఞ కళాపీఠం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థల నిర్వహణలో ముట్నూరి యజ్ఞ నారాయణ శర్మ భాగవతార్ 114వ జయంతి సందర్భంగా హరికథా మహోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సాయంత్రం ఉంటాయని నిర్వాహకులు మద్దాళి రఘురామ్, ముట్నూరి కామేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవాలు నల్లకుంటలోని శృంగేరి శంకర మఠంలో జరుగుతాయన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి మహోత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు పద్మాలయ ఆచార్య (నాగర్ కర్నూల్) భాగవతారిణిచే 'శ్రీ వేంకటేశ్వర ఆవిర్భావం'హరికథాగానం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు గరిమెళ్ల సత్యవతి (మదనపల్లి) భాగవతారిణిచే 'పార్వతి కల్యాణం'హరికథాగానం, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పాల రామాంజనేయులు (భీమవరం) భాగవతార్‌చే 'భక్త మార్కండేయ'హరికథాగానం ఉంటుందని తెలిపారు. హరికథా మహోత్సవానికి వయోలిన్-శశిభూషణరావు, మృదంగం-సుధాకర్ వాద్య సహకారం అందిస్తారని తెలిపారు.

## మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్న మోబీన్

**బహదూర్‌పురా:** బహదూర్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ మోబీన్ మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. గతంలో రెండు పర్యయాలు రామ్నాస్‌పురా కార్పొరేటర్‌గా మహ్మద్ మోబీన్ చేశారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శాస్త్రిపురం కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మోబీన్‌ను ఎమ్మెల్యే ఎన్నికల నేపథ్యంలో మజ్లిస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. దీంతో మహ్మద్ మోబీన్ బహదూర్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యేగా భారీ మెజార్టీగా గెలుపొందారు. దీంతో మొదటిసారి మహ్మద్ మోబీన్ అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

## ఘంటసాల అమరుడు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సారిపల్లి కొండల్‌రావు తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో గాన గంధర్వ ఘంటసాల 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత మద్దాలి రఘురామ్ రచించిన ఘంటసాల అభిమానిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు మాట్లాడుతూ.. తెలుగు భాష ఉన్నంత కాలం ఘంటసాల బతికే ఉంటాడని కొనియాడారు. అంతకు ముందు గాయని గాయకులు ఆలపించిన సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సినీ నటుడు సుబ్బరాయ శర్మ, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రవీంద్రభారతి ప్రాంగణంలో ఉన్న ఘంటసాల విగ్రహం వద్ద భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, పూలమాల వేసి నివాళులర్పించారు.

## అయ్యప్ప స్వాములకు ఆహార పదార్థాల పంపిణీ



ఆహార పదార్థాలను అందజేస్తున్న చలువాది శ్రీకాంత్

**చార్మినార్:** మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులకు సోమవారం ఉదయం ఉచితంగా ఆహార పదార్థాల పంపిణీ జరిగింది. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధి చలువాది శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజల అనంతరం భక్తులకు టిఫిన్ బాక్స్‌లలో ఆహార పదార్థాలను అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ..ఐదేళ్లుగా అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు.


## 'ప్రజల తీర్పును గౌరవిస్తాం'



మాట్లాడుతున్న మిత్ర కృష్ణ

**గోల్కొండ:** అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ ప్రజల తీర్పును గౌరవిస్తామని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మిత్ర కృష్ణ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని బీఆర్ఎస్ యువజన విభాగం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గం నుంచి ప్రజలు తనను ఆదరించి ఓటు వేశారన్నారు. రాష్ట్ర ప్రజల తీర్పు కూడా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వచ్చిందని ఆయన అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును హుందాగా గౌరవిస్తున్నామని ఆయన అన్నారు. ఉద్యమ పార్టీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీలో తాను పని చేశానని, జియాగూడ కార్పొరేటర్‌గా పోటీ చేసిన తనకు ప్రజలు ఆదరించి గెలిపించారని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాత్రి రాములు తదితరులున్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దేవర వంశీ తదితరులు

**గోల్కొండ:** ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల రోగాలను కొనితెచ్చుకుంటున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లోని హీరానగర్‌లో చెత్త డంపింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన జీహెచ్ఎంసీ పరిశుద్ధ్య సిబ్బందితో కలిసి చెత్త డంపింగ్ రోడ్డుపై నిషేధం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెత్తను రోడ్ల పక్కన వేస్తుండడం వల్ల ఆ ప్రాంతంలో దుర్గంధం వ్యాపించడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయన్నారు. చెత్తను తీసుకువెళ్లే రిక్షా కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారని, చెత్తను వారికే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సుధాకర్‌యాదవ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కార్వాన్‌లో పట్టు నిలుపుకొన్న మజ్లిస్

- బీజేపీ పెద్దలు ప్రచారం చేసిన ఫలితం శూన్యం
- ఓటింగ్ తగ్గడంతో పడిపోయిన మెజార్టీ

**గోల్కొండ:** కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ మరోసారి తన పట్టును నిలుపుకుంది. నియోజకవర్గంలో మైనార్టీలు అధిక సంఖ్యలో ఉండడం వల్ల ఆ పార్టీకి ఈసారి కూడా విజయం నల్లేరుమీద నడకలాగే సాగింది. ఈసారి కూడా సిట్టింగ్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్‌ను మజ్లిస్ పార్టీ రంగంలోకి దింపింది. అందరితో కలుపుకొనిపోయే గుణంతో పాటు తెలుగు భాషపై కూడా పట్టు ఉండడం కౌసర్ మోహియుద్దీన్‌కు కలిసి వచ్చిన అంశం. దీనికి తోడు పార్టీ జెండా మోసిన కార్యకర్త కావడంతో పార్టీలో వర్గాలకు అతీతంగా అందరిని కలుపుకుపోయే గుణం ఉన్న వ్యక్తిగా ఆయనకు పేరు ఉంది.

### మజ్లిస్, బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ..

రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తుండడం, కార్వాన్‌లో ఇది ఏమాత్రం ప్రభావం చూపించలేదు. కార్వాన్‌లో కాంగ్రెస్ పార్టీ ముస్లి మైనార్టీలకే టికెట్ ఇచ్చింది. ఇది కూడా మజ్లిస్ ఓటు బ్యాంకు మీద ఎటువంటి ప్రభావం చూపలేకపోయింది. బీజేపీ కూడా గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థినే రంగంలోకి దింపింది. పోటీ ప్రధానంగా మజ్లిస్, బీజేపీ మధ్యనే జరిగింది. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పార్టీ విజయం కోసం నియోజకవర్గం అంతా పర్యటించారు. రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు బహిరంగ సభల్లో కూడా ఆయన పాల్గొన్నారు. బీజేపీ సైతం పార్టీ రాష్ట్ర నాయకులను ప్రచారంలో దింపింది. పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కె.లక్ష్మణ్ రోడ్‌షో నిర్వహించిన కూడా మజ్లిస్‌పై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు నామమాత్రమే పోటీలో ఉన్నారన్న విషయం అర్థమై ఓటర్లు మజ్లిస్‌ను ఆదరించారు.

### మజ్లిసేతర పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేసినా..

నామినేషన్ వేసిన రోజు నుంచే మజ్లిస్ అభ్యర్థి నియోజకవర్గంలోని ఒక్క ఇంటిని సైతం వదలకుండా ప్రచారం నిర్వహించి హ్యాట్రిక్ విజయం సాధించారు. మజ్లిస్ పార్టీకి పట్టు గొమ్మలైన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లు మరోసారి మజ్లిస్ ఆధిక్యాన్ని చాటి చెప్పాయి. లంగర్‌హౌస్, కార్వాన్ డివిజన్‌లలో సైతం మజ్లిస్ పార్టీ ఓట్లు సాధించింది. ఈ రెండు డివిజన్‌లో బీజేపీకి మంచి పట్టు ఉంది. నియోజకవర్గం పరిధిలోని జియాగూడలో సైతం మజ్లిస్ ఓట్లు సాధించింది. మజ్లిసేతర పార్టీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన కూడా పతంగ్ జోరును అడ్డుకోలేకపోయాయి. అయితే ఓటింగ్ శాతం తగ్గడంతో మజ్లిస్ ఈసారి దాదాపు 20 వేల మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించింది.